క్లుప్తంగా


ఎస్‌ఈఐఎల్ ఎనర్జీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

తోటపల్లిగూడూరు: దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తిదారుల్లో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (సీల్)కు రెండో ఉత్తమ ఎగుమతిదారు (కోస్టల్) అవార్డు లభించింది. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పారాదీప్ పోర్ట్ అథారిటీ ఈ అవార్డు ఇచ్చినట్లు కంపెనీ సీఈఓ రాఘవ్ త్రివేది ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశాలోని పారాదీప్ పోర్టును సీల్ దేశీయంగా బొగ్గు ఎగుమతి చేసేందుకు ఉపయోగించుకొంటోందని, ఈ బొగ్గును కృష్ణపట్నం పోర్టులో దిగుమతి చేస్తుందన్నారు. మా సేవలను గుర్తించి పోర్ట్ అథారిటీ అవార్డును అందించడం సంతోషకరంగా ఉందన్నారు.

అంకమ్మ తల్లికి పూజలు



విడవలూరు: స్థానిక అంకమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారికి విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను పూజారి గిరి ఆధ్వర్యంలో జరిపారు. అమ్మవారు మహంకాళిగా దర్శనమిచ్చారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

ఆర్థిక సాయం



కొడవలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని యల్లాయపాళేనికి చెందిన కమతం సురేంద్రకు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. స్టాండ్ బై సపోర్ట్ ఫర్ నీడీ పీపుల్ టీమ్ సభ్యులు రూ.25 వేలను ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తమ వంతు సాయాన్ని అందిస్తామని తెలిపారు.

బాబోయ్.. కుక్కలు



విడవలూరు: మండలంలో కుక్కల బెడద నానాటికీ అధికమవుతోంది. కుక్కలు వెంటపడుతుండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. పిల్లలపై దాడి చేస్తాయేమోనని తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ సరికాదు



అక్రమ నిర్మాణంపై రాసిన హెచ్చరికలను చెరిపేసిన దుండగులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖలకు చెందిన భూమిని పలువురు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగర పంచాయతీకి సంబంధించిన భూమి అని గోడపై రాసి ఉన్న అక్షరాలను గుర్తుతెలియని వ్యక్తులు చెరిపేశారని చెప్పారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని స్పష్టం చేశారు.

దొంగ అరెస్ట్

- ఆటో, బైక్ స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): వాహన దొంగతనాలకు పాల్పడుతున్న ఓ పాతనేరస్తుడ్ని బాలాజీనగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. జగదీష్‌నగర్‌లోని బ్యాంక్ కాలనీలో గల ఓ అపార్ట్‌మెంట్ వద్ద నిలిపి ఉన్న ఆటో ఈ నెల 16న అపహరణకు గురైంది. ఆటో యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు అప్పట్లోనే కేసు నమోదు చేశారు. ఘటన స్థలంలో లభ్యమైన సీసీ పుటేజీల ఆధారంగా కొత్తూరు రామకోటయ్యనగర్‌కు చెందిన పాతనేరస్తుడైన హుస్సేన్ అలియాస్ ఉస్మాన్‌ను నిందితుడిగా గుర్తించి గాలింపు చర్యలను చేపట్టారు. ఈ క్రమంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా, ఆటోతో పాటు గొడ హాస్టల్ సెంటర్‌లో స్ప్లెండర్ బైక్‌ను చోరీ చేశానని అంగీకరించాడు. దీంతో నిందితుడ్ని అరెస్ట్ చేసి ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్లో సస్పెక్టెడ్ షీటు ఉందని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు.

గ్రామాలకు బస్సుల బంద్

- దూరమవుతున్న ఆర్టీసీ
- ఆటోలే దిక్కు



బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న విద్యార్థులు

మనుబోలు: కొంత కాలంగా ఆర్టీసీ బస్సులు పల్లెలకు దూరమవుతున్నాయి. దీంతో మనుబోలు మండల కేంద్రం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోవాలాలు పరిమితికి మించి ఎక్కించుకుని వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

గతంలో..

ఒకప్పుడు మండలంలోని పిడూరు, ఎస్ఎస్‌పురం, కాగితాలపూరు, అక్కంపేట, కొండుపాళెం, గురివిందపూడి తదితర గ్రామలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉండేది. ప్రస్తుతం బస్సులు గ్రామాల లోపలికి వెళ్లకుండా నేరుగా ప్రధాన రహదారి గుండా వెళ్లిపోతున్నాయి. మనుబోలు నుంచి బస్సులో వెళ్తే ప్రధాన రహదారి నుంచి గ్రామాలకు వెళ్లడానికి ఒకటి నుంచి 2 కిలోమీటర్లకు పైగా నడవాల్సి ఉంటుంది. దీంతో వివిధ గ్రామాల నుంచి మండల కేంద్రంలోని హైస్కూల్‌కు వచ్చే చాలామంది విద్యార్థులు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితులు వచ్చాయి. చాలామంది నెలకు డబ్బు ఇస్తామని ఒప్పందం చేసుకుంటున్నారు.

అంతమంది

మనుబోలులో జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సుమారు 900 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో మూడో వంతు మంది వివిధ గ్రామాల నుంచి నిత్యం రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. చాలామంది విద్యార్థులు ఆటోల్లో వెళ్తున్నా వచ్చే ఒకటి అరా బస్సులు మిగిలిన వారికి ఏ మాత్రం సరిపోవడం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో నెల్లూరు – గూడూరు మధ్య తగినన్ని బస్సులు నడపడంతో పాటు అన్ని గ్రామాల లోపలికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న విద్యార్థులు (ఫైల్)

పోలీసులు స్పందించి..

డ్రైవర్లు పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులు, ప్రజల్ని ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇది ప్రమాదకరమని తెలిసినా నిర్లక్ష్యంగా ఉంటున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే పోలీసులు స్పందించి తనిఖీలు చేయాల్సి ఉంది.

రెండుసార్లు బస్సులు నడపాలి



గురివిందపూడి నుంచి మనుబోలు, గూడూరు, నెల్లూరు వెళ్లాలంటే హైవే వరకూ కిలోమీటర్‌కుపైగా నడవాల్సి ఉంటుంది. గ్రామస్తులతోపాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గతంలో గ్రామానికి ఆర్టీసీ బస్సు వచ్చేది. కనీసం విద్యార్థుల కోసమైనా రోజుకు రెండుసార్లు ఉదయం, సాయంత్రం బస్సును గ్రామంలోకి నడపాలి.

– మన్నెమాల శ్రీహరిరెడ్డి, గురివిందపూడి

విద్యార్థులు, పేదలకు ఇబ్బంది



మా గ్రామం నుంచి మనుబోలు, గూడూరు, నెల్లూరు లేదా ఇతర చోట్లకు వెళ్లాంటే హైవేపైపైకి వెళ్లాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు లోపలికి రావడం లేదు. దీంతో నడవాల్సి వస్తోంది. పేదలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలే దిక్కయ్యాయి.

– గుమ్మడి వెంకటసుబ్బయ్య, ఎల్ఎస్‌పురం

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పొదలకూరులో..

పొదలకూరు: పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాల సమయంలో చేసిన పనుల్ని గుర్తుచేసుకుని మురిసిపోయారు. మండలంలోని మహ్మదాపురం డీఎస్సార్ జెడ్పీ హైస్కూల్లో 1991 – 92 మధ్య పదో తరగతి చదివిన వారు ఆదివారం అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అందరికీ జ్ఞాపికలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని పి.తిరుపతి, బి.మనోహర్, పి.మాధవ్, టి.వెంకటేశ్వర్లు ఆర్.చెంచయ్య, వి.హనుమంత్, పి.శంకరయ్య, కె.రమేష్, మురళి, సునీత, జ్యోతి, మోహన్ తదితరులు ముందుండి నడిపించారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: స్థానిక డీఎల్ఎన్నార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1971లో పదో



బుచ్చిరెడ్డిపాళెంలో..

తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకున్నారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. ఒకర్నొకరు ఆప్యాయంగా పలకరించుకొని సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనాథ్‌రెడ్డి, నజీర్, పద్మాకర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విశేషాలంకారంలో చాముండేశ్వరీదేవి



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారికి విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉభయ కర్తలుగా రామచంద్రయ్య, కుటుంబసభ్యులు వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ శ్రీనివాసులు పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా మలుపులు

పొదలకూరు: మండలంలో వివిధ మార్గాల్లో ప్రమాదకర మలుపులున్నాయి. రాపూరు మార్గం ఇనుకుర్తి జెడ్పీ హైస్కూల్, మర్రిపల్లి వద్దనున్న మలుపులు ప్రాణాంతకంగా మారాయి. వీటి వద్ద జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. డబుల్ రోడ్డు అయినా మలుపు వద్ద అప్రమత్తంగా లేకుండా వాహనాలను నడిపితే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇదే రహదారిపై టిప్పర్లు కంకరను లోడుతో వేగంగా తిరుగుతున్నాయి. ఈ క్రమంలో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. చిన్నచిన్న ప్రమాదాలు లెక్కకు మించి జరుగుతున్నట్టు ఆయా గ్రామస్తులు వెల్లడించారు. పొదలకూరు – సోమశిల మార్గం లింగంపల్లి తోపు వద్ద మలుపు ఉంది. ఇక్కడ అడపాదడపా ప్రమాదాలు జరుగుతున్నాయి. నావూరు – పొదలకూరు మార్గంలో



ఇనుకుర్తి వద్ద మలుపు

అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరు వద్ద మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సంగం – పొదలకూరు మార్గంలో విరువూరు గ్రామంలో మలుపులు ఇబ్బందికంగా ఉన్నాయి. ఇక్కడ కూడా యాక్సిడెంట్లు సంభవిస్తున్నాయి.

ప్రధాన రోడ్లపై చెత్తదిబ్బలు

- వాహనదారుల ఇబ్బందులు

తోటపల్లిగూడూరు: నరుకూరు – కోడూరు, నరుకూరు – తోటపల్లిగూడూరు ప్రధాన రహదారు వెంబడి ఉన్న చెత్తదిబ్బలు వాహనదారులకు ఇబ్బందిగా మారాయి. ముఖ్యంగా నరుకూరు – కోడూరు ప్రధాన రహదారి చింతోపు, ముంగళదొరువు గ్రామాల సమీపంలో నడిరోడ్డుపై స్థానికులు చెత్తదిబ్బలు పోగు చేస్తున్నారు. కోడూరు, నరుకూరు – తోటపల్లిగూడూరు ప్రధాన రహదారిల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. పేడూరు, తోటపల్లిగూడూరు గ్రామాల వద్ద రోడ్లపైనే చెత్తదిబ్బలు దర్శనమిస్తున్నాయి. వీటి సమీపంలో వాహనాలు ఎదురుపడితే పక్కకు తప్పుకోవడం కష్టంగా మారుతోంది. ఈ క్రమంలో



నరుకూరు – తోటపల్లిగూడూరు ప్రధాన రహదారిలో..

ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని గొలగమూడి సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు నగరం పొదలకూరురోడ్డు ప్రాంతానికి చెందిన రమణరావు పని నిమిత్తం బైక్‌పై గొలగమూడికి వచ్చాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా సర్వేపల్లి కాలువ సమీపంలో ఎదురుగా వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రమణరావుకు గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గణపతి విగ్రహం ఊరేగింపు



ముత్తుకూరు: మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ జంగాలకండ్రిగ నుంచి ఆదివారం గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. శనివారం రాత్రి శోభయమానంగా అలంకరించిన విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. యువకులు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. దీంతో మండలంలో గణపతి విగ్రహాల నిమజనం పూర్తయింది.

పొదలకూరులో వర్షం

పొదలకూరు: అల్పపీడన ప్రభావంతో పట్టణంలో ఆదివారం వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. పదిరోజులుగా ఎండ వేడిమితో అల్లాడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది.

క్రైస్తవ సంఘాల సమావేశం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని క్రైస్తవ సంఘాల పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు సెల్‌ను ఏర్పాటు చేసే దిశగా చర్చలు జరిపామని వివరించారు. క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని తెలిపారు.

కోడి పందేల స్థావరాలపై దాడులు

కోవూరు: కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడులను ఆదివారం నిర్వహించారు. వివరాలు.. కోవూరులోని గుమ్మళ్లదిబ్బలో కోడిపందేలను నిర్వహిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సై రంగనాథ్‌గౌడ్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఆరు కోడి పుంజులతో పాటు ముగ్గురు పందెంరాయుళ్లు, ఆరు ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూపులు

- భారీ వర్షం వస్తే వాగు పొంగి స్తంభించనున్న రాకపోకలు

పొదలకూరు: మండలంలోని అల్లూర్తి – నావూరు రహదారి మధ్యనున్న వాగుపై బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలు పెరగడంతోపాటు, ప్రయాణ దూరం తగ్గుతుంది. గతంలో బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు పూర్తి చేసుకున్నా వివిధ కారణాలతో ఆచరణలో కొంత జాప్యం నెలకొంది. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జెడ్పీ చైర్మన్‌గా పనిచేస్తున్న కాలంలో గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పలు కారణాలతో కార్యరూపం దాల్చలేదు. తర్వాత అల్లూర్తి – నావూరు లింక్ రోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్అండ్‌బీలో విలీనం చేశారు. ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా కూడా బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపారు. ఎందుకో ముఖ్యమైన బ్రిడ్జి నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. తాత్కాలికంగా పైపు కల్వర్టు నిర్మించేందుకు ఆయా గ్రామస్తులు కోరినా పనులు జరగలేదు.

ఎంతో ఉపయోగం

మండలంలోని అల్లూర్తి – నావూరు రోడ్డు మధ్యలో వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేస్తే వర్షాకాలంలో సైతం గ్రామాల మధ్య రాకపోకలు ఇబ్బంది లేకుండా జరుగుతాయి. ఈ రోడ్డు మీదుగా పులికల్లు, మొగళ్లూరు, అంకుపల్లి, ఆర్‌వైపాళెం, వావింటపర్తి, ఊసపల్లి గ్రామాల నుంచి అల్లూర్తి మీదుగా నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లొచ్చు. ఇదే రహదారి మీదుగా నేదురుమల్లి, బత్తులపల్లి, సంగం వరకు పైగ్రామాల ప్రజలు వెళ్లేందుకు అవకాశం ఉంది. ఇందువల్ల 10 కి.మీ దూరం తగ్గుతుంది. అంతేకాక లింక్ రోడ్డు మీదుగా ప్రయాణం చేస్తే గ్రామాల మధ్య రాకపోకలు పెరిగి సత్సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. అల్లూర్తి నుంచి కొంత వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల ప్రయాణంలో ఇబ్బందులు తలెత్తవు. మధ్యలో వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం వల్ల కాస్త వర్షానికే వాగు పొంగి రాకపోకలు స్తంభించిపోతున్నాయి.



అల్లూర్తి – నావూరు రహదారి మధ్యలో ఉన్న వాగు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మనుబోలు: మండలంలోని బండేపల్లి గ్రామంలో గంగమ్మ తల్లి నెలకొలువును శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని సింహ వాహనంపై కొలువుదీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ సభ్యులు అవుల నరేంద్రబాబు, ఉడతా రవి, మేకల యోగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

మనుబోలమ్మకు..

మనుబోలు పెద్ద చెరువు గట్టునున్న గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. చలిపిండి, పానకాలు, పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్చకుడు ఫణీంద్రశర్మ గ్రామదేవతలకు ప్రత్యేకాలంకరణ చేసి విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. ఉభయకర్తలుగా బొమ్మిరెడి సుమంత్‌రెడ్డి, అఖిల దంపతులు వ్యవహరించారు.

వినాయకునికి..

పొదలకూరు: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించిన తర్వాత వచ్చే 16వ రోజు పండగ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో భక్తులు కార్యక్రమాలను నిర్వహించారు. వినాయకుని చిత్రపటాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక పుట్టాయగుంట వీధిలో విగ్రహం పెట్టిన ప్రాంతంలో పద్మావతి నగర్‌కు చెందిన పండరి భజన భక్త బృందం కార్యక్రమాన్ని చేసింది.



గంగమ్మ గ్రామోత్సవం



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

స్పందించండి సారూ..

వెంకటాచలం: మండలంలోని కసుమూరు గ్రామంలోని మస్తాన్‌వలీ దర్గా సమీపంలో చెరువు కట్టపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా ఉంది. తక్కువ ఎత్తులో దిమ్మె నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం, శుక్రవారం భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో భక్తులు తెలియక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరే చోటుకు మార్చి, ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

అలరించిన క్రాఫ్ట్స్ మేళా

కొడవలూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో క్రాఫ్ట్స్ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యం అందర్నీ ఆకట్టుకుంది. కలర్ పేపర్లు, అట్ట ముక్కలు తదితరాలతో ఆకర్షణీయమైన బొమ్మలు, వస్తువులను విద్యార్థులు రూపొందించి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రవీంద్రబాబు మాట్లాడారు. బొమ్మలను తయారు చేయడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న కళానైపుణ్యం పెంపొందడంతో పాటు వారిలోని సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని చెప్పారు. అనంతరం అద్భుతమైన కళా రూపాలను ప్రదర్శించిన వారికి బహుమతులను ఉపాధ్యాయులు రేఖారాణి, సుబ్బారావు, ఖాదర్‌బాషా, శ్రీనివాసులురెడ్డి, సుబ్రహ్మణ్యం, సత్యానంద, కవిత తమ సొంత నిధులతో అందజేశారు.



విద్యార్థులకు బహుమతుల ప్రదానం

బుచ్చిలో స్వచ్ఛత హీ సేవ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వాటర్ ట్యాంక్‌లు, ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.



చెత్తను తొలగిస్తున్న కమిషనర్ తదితరులు

మాది ప్రజా ప్రభుత్వం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: తమది ప్రజా ప్రభుత్వమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రేబాలలో ఆదివారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు.

ఇంటింటికీ తిరిగి వంద రోజుల పాలనపై వివరించారు. హామీలను త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు.



ప్రభుత్వ పాలనను వివరిస్తున్న వేమిరెడ్డి దంపతులు